క్లుప్తంగా

అల్లర్లకు పాల్పడితే చర్యలు



రాజకీయ పార్టీల నాయకులకు నిబంధనలను వివరిస్తున్న ఎస్‌ఐ గంగయ్య

శ్రీశైలంప్రాజెక్ట్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల వేళ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నిబంధనల మేరకు నడుచుకోవాలని, అలా కాకుండా అల్లర్లకు పాల్పడినా, రెచ్చగొట్టేలా వ్యవహరించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీశైలం టూటౌన్ ఎస్‌ఐ గంగయ్య యాదవ్ తెలిపారు. ఆదివారం సున్నిపెంట పోలీస్ ఔట్ పోస్టులో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలుతో పాటు సీఆర్‌పీసీ 30 చట్టాలు అమలులో ఉంటాయన్నారు. బహిరంగానే కాకుండా, సామాజిక మాధ్యమాల్లో కూడా ఎన్నికల నియమాళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓంకారంలో భక్తజన సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవులు ఉండటంతో పలు ప్రాంతాల భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి వచ్చారు. భక్తులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని శ్రీ వేంకటేశ్వరస్వామి, ఉప ఆలయాలను సందర్శించారు. పూజల అనంతరం భక్తులు శ్రీ కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అన్న ప్రసాదాలు స్వీకరించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మహానందీశ్వరుడి దర్శనానంతరం ఎన్నికల అబ్జర్వర్ భగవత్ కిషోర్ మిశ్రా

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో శ్రీశైలం ఎన్నికల అబ్జర్వర్, ఐఆర్ఎస్ అధికారి భగవత్ కిషోర్ మిశ్రా దంపతులు ఆదివారం మహానందికి వచ్చారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు.

మహానందిలో భక్తుల సందడి



దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

మహానంది: వేసవి సెలవులు, ఆదివారం కావడంతో వేలాది మంది భక్తజనంతో మహానంది ఆలయం కిటకిటలాడింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం 5.30 గంటలకు జరిగిన అష్టవిధ మహా మంగళ హారతుల సమయం నుంచి రాత్రి 9.30 గంటల వరకు దర్శనం నిర్విరామంగా కొనసాగింది.

సన్మానం

పాములపాడు: పదవ తరగతి పరీక్షల్లో 583(600) మార్కులు సాధించి ప్రతిభ చాటిన క్రిష్టారావుపేట గ్రామానికి చెందిన పసుపుల వరుణ్‌ను ఆదివారం వాయిస్‌సేవా సంస్థ సభ్యులు సన్మానించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో వరుణ్‌ను రిటైర్డు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, ఆ సంస్థ సభ్యులు జ్ఞాపిక, నగదు, ధృవీకరణ పత్రంతో సత్కరించడంపై విద్యార్థి తల్లిదండ్రులు రవీంద్రనాయుడు, నోములక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు.

గుహలను సందర్శించిన కౌంటింగ్ అబ్జర్వర్



వాల్మీకి గుహలను తిలకిస్తున్న ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్ తదితరులు

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో వెలసిన వాల్మీకి గుహలను ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎలక్షన్ కౌంటింగ్ అబ్జర్వర్ ఎ.దినేశ్ కుమార్, ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగరాజు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు గుహల అందాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సహజసిద్ధంగా వెలసిన వాల్మీకి గుహలు అద్భుతంగా ఉన్నాయన్నారు. గుహల పైభాగంలో వేలాడే శిలాజాకృతులు, శివలింగం, నంది ఆకృతి చూసి మధురానుభూతి పొందినట్లు తెలిపారు. వారితో పాటు ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, వీఆర్‌ఓ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు: ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఆత్మకూరు మండల ప్రజలతో శాంతిభద్రతలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ దృష్ట్యా ఆత్మకూరు, నందికొట్కూరు, శ్రీశైలం పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఎలాంటి సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత గెలుపొందిన వారి వర్గీయులు బాణసంచా పేల్చడం, ర్యాలీలు చేపట్టడం నిషేధమన్నారు. అలాగే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఫలితాల పేరుతో కొందరు బెట్టింగులకు పాల్పడుతున్నారని, నిర్వాహకులపై సమాచారమిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు.సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆత్మకూరు సీఐలు నాగభూషణ్‌యాదవ్, లక్ష్మినారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు

మిడుతూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున మండలంలోని మాసపేట, నాగలూటి, చెరుకుచెర్ల గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా మండలంలో ఒక మొబైల్ పార్టీ వాహనంలో ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు, యమర్జెన్సీ సమయంలో క్యూ ఆర్టీ వాహనం ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ రోజున ఎక్కడికి వెళ్లకుండా స్వగ్రామంలోనే ఉండాలని సూచించారు. పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులుగా సంచరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయోత్సవ సంబరాలకు అనుమతులు లేవు

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4న నిర్వహిస్తున్న నేపథ్యంలో విజయోత్సవ సంబరాలకు ఏ మాత్రం అనుమతి లేదని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడారు. కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్, పోలీస్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల ఫలితాలు వెలుబడిన తర్వాత ఏ రాజకీయ పార్టీకి కూడా విజయోత్సవ ర్యాలీలు, సంబారాలు చేసుకోకూడదని సూచించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

జంబులమ్మ దేవికి ప్రత్యేక పూజలు



ఆలయ ప్రాంగణంలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో ఆదివారం జంబులమ్మదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం, విగ్రహం ప్రతిష్ట నిర్వహించి ఆదివారం నాటికి 41 రోజులు పూర్తవ్వడంతో పురోహితులు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి చీరె, సారె, గాజులు, పసుపు, కుంకుమ, కాయ,కర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు మద్దిలేటి, శ్రీనివాసులు, మనోహర్ తదితరులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

కొత్తూరులో జడ్జి పూజలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వస్వామి ఆలయంలో ఆదివారం కృష్ణా జిల్లా నూజివీడు అడిషనల్ జిల్లా జడ్జి శైలజ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, సహస్ర పూజలు చేశారు. ఆలయ చరిత్రను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల తర్వాత శేషవస్త్రాలతో సన్మానించారు. ఈఓ రామకృష్ణ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్‌స్వామి తదితరులు ఉన్నారు.



జడ్జి కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే శిల్పా



దర్శనం అనంతరం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం మల్లన్న దర్శనార్థం శ్రీశైలం చేరుకున్న ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా శ్రీస్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. నాయకులు రజాక్, అనిల్ కుమార్ రెడ్డి, విష్ణు, రవి తదితరులున్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని కొండ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు సయ్యద్‌పహిల్వాన్ కుమార్తె నిఖా వేడుకకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు.

బుక్కాపురంలో ఏకాదశి పూజలు

మహానంది: వైశాఖమాసం ఏకాదశిని పురస్కరించుకుని బుక్కాపురం గ్రామంలో కొలువైన గ్రామదేవతలు సుంకులమ్మ, మారెమ్మ, గంగమ్మ, మౌలాలి స్వామి వార్లకు ఆదివారం గ్రామానికి చెందిన మహానంది మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, కుంచపు పెద్ద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వారు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కార్యక్రమానికి హాజరుకాగా వైస్ ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంచపు ప్రసాద్, కుంచపు శ్రీనివాసులు స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, నాయకులు కందుల రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయండి

- వివాదాలకు దూరంగా ఉండేలా ప్రజలను చైతన్య పరచండి
- నిత్యం అప్రమత్తంగా ఉండండి
- జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి



కొండమనాయునిపల్లెలో పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

అవుకు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4న నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే ఏ మాత్రం ఉపేక్షించొద్దని ఆదేశించారు. మండల పరిధిలోని కొండమనాయునిపల్లెలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌ను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. గ్రామ ప్రజల పరిస్థితులపై ఎస్పీ ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వివాదాలకు దూరంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ నేపథ్యంలో విజయోత్సవ సంబరాలు నిషేధమని, ఆ దిశగా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘించినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వ్యక్తులను ఏ మాత్రం ఉపేక్షించొద్దని, కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ తిమ్మారెడ్డి, స్థానిక ఎస్‌ఐ కిరణ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ హరినాథ్ రెడ్డి, కానిస్టేబుల్ ఉశేన్ పాల్గొన్నారు.

పుస్తకాలను అపురూపంగా చూసుకోవాలి

పగిడ్యాల: జ్ఞాన సముపార్జనకు దోహదం చేసే పుస్తకాలను అపురూపంగా చూసుకోవాలని లైబ్రేరియన్ మద్దమ్మ విద్యార్థులకు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాల ఆవశ్యకతను మద్దమ్మ వివరించారు. సభ్యత్వం కలిగి ఉంటే అవసరమైన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చునని సూచించారు. జ్ఞానానికి మించిన సంపద లేదని లైబ్రేరియన్ విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఏడు వారాల నీతి కథల పుస్తకం నుంచి సమయ స్ఫూర్తి అనే కథను విద్యార్థులతో చదివించి భావాన్ని వివరించారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు



విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): క్రమశిక్షణ, పట్టుదలతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ల సుదర్శనం శెట్టి, వాయిస్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. చదువుకు పేదరికం అడ్డురాకూడదని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. స్థానిక సంఘమిత్ర సమావేశ భవనంలో ఆదివారం మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన వారికి ఒక్కొక్కరికి రూ.1,100 నగదు, మెమొంటో అందజేసి సన్మానించారు. వారు మాట్లాడుతూ 21మండలాల నుంచి వచ్చిన మండల టాపర్లను నగదు పురస్కారాలతో సన్మానించామని చెప్పారు. ప్రమోద్, సుందర్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

వనరులను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు అందుబాటులోనున్న వనరులను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని బలిజ కాపు సేవా సమితి వ్యవస్థాపకులు దండె దస్తగిరి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఇటీవల పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు అందజేశారు. అధ్యక్షుడు కొప్పుల సుబ్బారెడ్డి మాట్లాడుతూ జంబులన్న ట్రస్టు ద్వారా వర్ధంశెట్టి రాజారాం దంపతుల సహకారంతో వెదుర్ల రామచంద్రారావు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, సుంకన్న, మాజీ కౌన్సిలర్ కూరాకు రవి ఆర్థిక సహకారంతో 70మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశామని చెప్పారు. నరేష్, ప్రసాద్, శ్రీనివాసులు, రాజశేఖర్, ఆదినారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

మాధవుని గీతాజ్ఞానమే త్రైత సిద్ధాంతం

ఓర్వకల్లు: మాధవుడు ప్రబోధించిన గీతాజ్ఞానమే త్రైత సిద్ధాంతమని మిడుతూరు ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షులు రామచంద్రుడు అన్నారు. ఆదివారం మండలంలోని కాల్వబుగ్గ, ఉప్పలపాడు గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ.. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తియోగం అధ్యాయంలో 16వ శ్లోకంలో జీవాత్మ క్షర పురుషుడని, ఆత్మ అక్షర పురుషుడని ప్రబోధించారు. అలాగే 17వ శ్లోకంలో పరమాత్మ పురుషోత్తముడని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మలు ఆధ్యాత్మికంలో ప్రధానమైనవిగా అర్థం చేసుకోవాలని సూచించారు. వీటి ఆధారంగానే ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులస్వామి త్రైత సిద్ధాంత భగవద్గీతను స్పష్టంగా రచించినట్లు తెలిపారు. మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమని ప్రబోధిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రాఘవేంద్ర, సుజాత, హైమావతి, సుబ్బలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతోనే కీళ్లవాతం నివారణ

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారానే కీళ్లవాతం వల్ల వచ్చే ఇబ్బందులు నివారించుకోవచ్చని ప్రముఖ కీళ్లవ్యాధి నిపుణులు డాక్టర్ జి. శ్రీహరిరెడ్డి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఏ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో కీళ్ల నొప్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థరైటిస్ అనేది వ్యాధి కాదని, అదొక లక్షణమని చెప్పారు. సాధారణంగా 50 నుంచి 60 ఏళ్లు దాటిన తర్వాత వచ్చేది ఆస్టియో ఆర్థరైటిస్ అని, ఇన్‌ఫ్లమేటిరి ఆర్థరైటిస్ ఇమ్యూన్‌సిస్టమ్ మనకు వ్యతిరేకంగా పనిచేయడం వల్ల వస్తుందని తెలిపారు. ఇందులో సాధారణంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, లూపస్, ఆంకిలోజింగ్ ఆర్థరైటిస్, సోరియాసిస్, గౌట్ తదితరాలు ఉంటాయని వివరించారు. ఆస్టియో ఆర్థరైటిస్‌కు కీళ్లమార్పిడి ఒక్కటే పరిష్కారమన్నారు. కీళ్లవాతానికి అనేక ఆధునిక మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ రుగ్మతలో ఉదయం లేస్తూనే నొప్పులు ఉండటం, అరగంట నుంచి గంట తర్వాత అవే తగ్గిపోతుంటాయన్నారు. కొందరికి కీళ్లవద్ద వాపు, ఎర్రగా ఉండటం కనిపిస్తుందన్నారు. నొప్పుల వల్ల సాధారణ పనులు చేసుకోలేరన్నారు. ఇది చిన్నవారి నుంచి పెద్ద వారికి ఎవరికైనా వస్తుందన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా వస్తోందని చెప్పారు. ఆర్థరైటిస్ కేవలం కీళ్లకే కాకుండా శరీరంలో ఏ అవయవన్నైనా బాధించవచ్చన్నారు. ఆర్థరైటిస్ జన్యుపరంగా, స్మోకింగ్ వల్ల, జీవనశైలిలో మార్పులు, జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్ల, మానసిక ఒత్తిళ్ల కారణంగా వస్తుందని తెలిపారు. ఆహారంలో మార్పులు చేసుకోవడం, శారీరక వ్యాయామం చేయడం, ధ్యానం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ రుగ్మతను కొన్ని రకాల రక్తపరీక్షల ద్వారా నిర్ధారణ చేస్తామన్నారు. కీళ్లనొప్పులు తగ్గించుకునేందుకు కొందరు స్టిరాయిడ్స్, నొప్పుల మాత్రలు అధికంగా వాడితే సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా ఉంటాయన్నారు.



సంప్రదాయ నృత్యం చేస్తున్న కళాకారులు

అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై శ్రీలక్ష్మీ నరసింహస్వామి మ్యూజికల్ డాన్స్ అకాడమీ, హైదరాబాద్ వారి సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమములో గణపతి ప్రార్థన, మూషిక వాహన, శివతాండవం, శివాష్టకం, బిల్వాష్టకం, లింగాష్టకం, శంకరా శశిధర, బాలత్రిపుర సుందరి తదితర అష్టకాలకు, గీతాలకు జి.గాయత్రి, పి.సాయి విధాత్రి, సి. సునంద, టి.భువనేశ్వరి, ఎం.తన్మయిశ్రీ, సి.స్వాతి, డి.సురభి, ఎం.స్వాతినాగలక్ష్మీ, ఆర్.గీతవాణి, పి.పల్లవి తదితరులు నత్యం చేశారు.

కురిసిన వర్షం.. రైతన్న హర్షం



ప్రధాన రహదారి పై నిలిచిన వర్షపు నీరు

పాములపాడు: మండలంలో ఆదివారం కురిసిన వర్షం రైతులను ఆనందంలో ముంచెత్తుతోంది. ఇప్పటికే మండలంలోని బానుముక్కల గ్రామంలో రైతులు పొలాల్లో మొక్కజొన్న విత్తగా మొలకలెత్తాయి. మిగతా గ్రామాల్లో రైతులు మరో వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో పొలాలు మరింత అదునుగా మారాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతలో వాన కష్టాలు

మండల కేంద్రంలో ఆదివారం వారపు సంత నిర్వహిస్తారు. సాయంత్రం మండల కేంద్రంతో పాటు, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు వారపు సంతలో కూరగాయలు, నిత్యవసర సరుకులు కొనుగోలుకు వారపు సంతకు తరలి వెళ్లారు. అయితే సాయంత్రం కురిసిన వర్షం పలు ఇబ్బందులకు గురి చేసింది. వ్యాపారులు అంగళ్లలో ఉంచిన సరుకులు వర్షానికి తడవకకుండా కాపాడుకునేందు తంటాలు పడ్డారు.

ఓ మోస్తరు వర్షం

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరుతో పాటు పీరుసాహెబ్ పేట, చెరుకుచెర్ల, సుంకేసుల, చింతలపల్లి, దేవనూరు తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రజలు ఎండ వేడిమికి, ఉక్కపోతకు తట్టుకోలేక ఇబ్బందులకు పడుతున్న నేపథ్యంలో వర్షం రాకతో ఉపశమనం పొందారు. ఖరీఫ్ సాగుకు ఈ వర్షం అనుకూలమని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గాలి,వాన..నిలిచిన విద్యుత్ సరఫరా

జూపాడుబంగ్లా: ఈదురుగాలులతో కూడిన వర్షం కురవటంతో ఆదివారం సాయంత్రం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విపరీతమైన ఎండతీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఆకాశంలో మేఘాలు అలుకొన్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం అరగంటపాటు కురవగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వారం నుంచి తీవ్రమైన ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు కురిసిన కొద్దిపాటి వర్షానికి కాస్త ఉపశమనం పొందారు.



బెల్ట్ పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

బెల్ట్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా స్పైట్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీశైలం హైస్కూల్‌లో బెల్ట్ పరీక్ష, టెక్నికల్ సెమినార్ ఆదివారం నిర్వహించారు. ఈ బెల్ట్ పరీక్షలో ఐదుగురు ఎల్లో బెల్ట్, ఐదు ఆరెంజ్ బెల్ట్, 30 మందికి గ్రీన్ బెల్టులు, 5 బ్రౌన్ బెల్ట్, ఒకరికి బ్లాక్ బెల్ట్ ప్రదానం చేశామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహాన్ షేక్ నూర్‌బాషా తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ ద్వారా క్రమశిక్షణ అలవడుతుందన్నారు.

మాతృభాష, సంస్కృతిని కాపాడుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అతిథులు

నంద్యాల(న్యూటౌన్): మాతృభాష, మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని డాక్టర్ గెలివి సహదేవుడు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని 18 రోజుల పాటు జరిగిన ఆచార్య ప్రశిక్షణ వర్గ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ప్రొఫెసర్ గొల్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు బోధించి ఉన్నత స్థితికి ఎ దుగేందుకు తోడ్పడాలని సూచించారు. ఎద్దుల మహేశ్వరరెడ్డి,కన్నబాస్కర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

వెలుగోడు: దాదాపు 18 ఏళ్ల తరువాత నాడు కలిసి చదువుకున్న విద్యార్థులంతా చదువులమ్మ ఒడిలో మరోసారి కలిశారు. ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో జీవితంలో స్థిరపడిన వారంతా కలిసి నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. రేగడగూడురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2006–2007 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా మృతిచెందిన మిత్రులకు సంతాపం తెలిపారు. చివరగా నాటి గురువులను సత్కరించారు. హెచ్‌ఎం అబ్దుల్ ఖాదర్, లక్ష్మీకుమారి, రఘునాథ్ రెడ్డి, బసిరెడ్డి, షణ్ముఖ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, ఆచారి,భాస్కర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.